షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
THE POWER OF PEN RK
సంపుటి : 2 సంచిక : 181 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 25 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు
VOLUME : 02 ISSUE : 181 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 25 May 2025 PAGES : 8 PRICE : 3/-

## అమరావతిని రాజధానిగా నోటిఫై చేయండి



- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం చంద్రబాబు వినతి
- వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే చేయాలని కోరినట్లు వెల్లడి
- విశాఖకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రకటన
- అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి?
- రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ?
- వైకాపా అధినేత వైఖరిపై చంద్రబాబు అసహనం
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు

జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ మేరకు విభజన చట్టాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి హోంమంత్రిత్వశాఖ కార్యాలయంలో అమిత్‌షా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని శాంతిభద్రతలు, కొత్త నేర న్యాయ చట్టాల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులేమీ సమకూర్చడంలేదని, కానీ కొందరు మూర్ఖులు మాత్రం రాష్ట్రంలో ఏ చిన్న పని జరగకపోయినా అంతా అమరావతిలో ఖర్చు పెడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.'కొందరు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అమరావతి వల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి? రాజధాని కోసం రైతులు -మిగతా 2లో

## ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

ఈశాన్య రాష్ట్రాలు గతంలో ఎప్పుడూ లేనంతగా పురోగమిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వైవిధ్యమే ఈశాన్య ప్రాంతానికి అతిపెద్ద బలమన్నారు. దిల్లీలోని భారత మండపంలో రెండు రోజులపాటు జరిగే రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సును శుక్రవారం మోదీ ప్రారంభించారు. సదస్సుకు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు, దౌత్యవేత్తలు తదితరులు తరలివచ్చారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, అనిల్ అగర్వాల్ వంటి పారిశ్రామికరంగ దిగ్గజాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈశాన్య భారతం ఒక పవర్‌హౌస్ అని, మనకు అష్టలక్ష్మి వంటిదని అభివర్ణించారు. భారతదేశ సెమీకండక్టర్ వ్యవస్థను బలోపేతం చేయడంలో అస్సాం పాత్ర పెరుగుతోందన్నారు. గతంలో ఈశాన్య ప్రాంతమంటే బాంబులు, తుపాకులు, రాస్తారోకోలకు మారుపేరుగా ఉండేదని, దీనివల్ల స్థానిక యువత చాలా అవకాశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంలో ఈశాన్య యువత హింసను విడిచిపెట్టినట్లు ప్రధాని తెలిపారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, నక్సలిజాన్ని ఉపేక్షించడం లేదన్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని అవకాశాల భూమిగా మార్చడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల కీలక వాటాదారులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు ఒకే వేదిక మీదకు వచ్చారన్నారు. పర్యాటకంతోపాటు వివిధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.

**మోదీకి సెల్యూట్ చేస్తున్నా: ముకేశ్ అంబానీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సదస్సులో ప్రశంసలు కురిపించారు. -మిగతా 2లో

## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిపై సమగ్ర చర్చ



'రాయలసీమ అభివృద్ధి'పై ప్రత్యేక ఫోకస్
కూటమి ఏడాది పాలనపై తీర్మానాలు
మహానాడు తొలిరోజు ప్రతినిధుల సభ.. తెదేపా
సంస్థాగత నిర్మాణంపై దిశానిర్దేశం
రెండోరోజు సంక్షేమం, అభివృద్ధి పథకాలపై
చర్చించనున్న నేతలు -మిగతా 2లో

## టాలీవుడ్‌కు పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్..



- 'రిటర్న్ గిఫ్ట్' తప్పదంటూ వ్యాఖ్య!
- ఏపీ ప్రభుత్వం పట్ల సినీ పెద్దలకు కృతజ్ఞత లేదని పవన్ కల్యాణ్ ఆవేదన
- ముఖ్యమంత్రిని కలవకపోవడంపై డిప్యూటీ సీఎం అసంతృప్తి
- గత ప్రభుత్వ వేధింపులు మరిచారంటూ చురకలు
- వ్యక్తిగత టికెట్ ధరల వినతులు ఇక కుదరవని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 24)

తెలుగు చలనచిత్ర పరిశ్రమ పెద్దల వైఖరిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో -మిగతా 2లో



## 3 దేశాల నేతలతో భారత ఎంపీల భేటీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

పహల్గాం ఉగ్ర దాడి, పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదం, దానిపై మన వైఖరిని వివరించేందుకు ప్రపంచంలోని పలుదేశాల్లో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలు శుక్రవారం రష్యా, జపాన్, యూఏఈల్లో నేతలు, ఉన్నతాధికారులతో భేటీ అయ్యాయి. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదన్న భారత విధానాన్ని వారికి వివరించాయి. ఈ సందర్భంగా భారత్ అనుసరిస్తున్న విధానానికి ఆయా దేశాలు సంఘీభావం తెలిపాయి. -మిగతా 2లో

## కపటత్వ ప్రదర్శనలో పాక్ ఆరితేరింది: భారత్




(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

ఉగ్రవాదులకు, పౌరులకు మధ్య తేడా చూపని పాకిస్థాన్‌కు ప్రజల ప్రాణాలను రక్షించడం గురించి మాట్లాడే అర్హత లేదని భారత్ పేర్కొంది. శుక్రవారం ఐక్యరాజ్యసమితిలో సాయుధ సంఘర్షణలో పౌరుల రక్షణ అంశంపై చర్చ నిర్వహించారు. ఈసందర్భంగా పాక్ రాయబారి అసిమ్ ఇఫ్తికర్ అహ్మద్ మరోసారి కశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంతో పాటు ఇటీవల ఇరుదేశాల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను గురించి ప్రస్తావించారు. దీనిపై భారత్ దీటుగా బదులిచ్చింది. ఐరాసాలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ..

'పాకిస్థాన్ ప్రతినిధి పలు అంశాలపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. భారత్ దశాబ్దాలుగా పాక్ ప్రాయోజిత ఉగ్రవాదులతో పోరాడుతోంది. 26/11 ముంబయి దాడుల నుంచి ఇటీవల పహల్గాంలో అమాయక పర్యాటకులపై ఉగ్ర దాడులు చేశారు. పౌరులే ప్రధాన లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారు. పహల్గాం దాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ ను నిర్వహించి పాక్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో మృతిచెందిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు ఆ దేశ సీనియర్ ప్రభుత్వ, పోలీసు, సైనిక అధికారులు హాజరై నివాళులర్పించడం చూశాం. ఉగ్రవాదులు, పౌరుల మధ్య తేడాను గుర్తించని ఆ దేశానికి మమ్మల్ని విమర్శించే అర్హత లేదు' అని హరీశ్ పేర్కొన్నారు. -మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్ మన బలగాల సామర్థ్యాన్ని చాటిచెప్పింది



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' భారత్‌లో ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్నది పాకిస్థాన్ అన్న విషయాన్ని పూర్తిగా బహిర్గతం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ ప్రధాని మోదీ కృతనిశ్చయాన్ని, మన నిఘా విభాగాల సామర్థ్యాన్ని, భద్రతాదళాల శక్తిని చాటిచెప్పిందన్నారు. "కొందరు భారత పౌరుల ప్రాణాలు హరించడంతోపాటు సరిహద్దులో మన సైనిక స్థావరాలపై దాడి చేసిన పాక్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా దీటైన సమాధానం ఇచ్చాం. పాకిస్థాన్ భూభాగంలో 100 కిలోమీటర్ల లోపల ఉన్న లక్ష్యాలను ఛేదించి మన సత్తా చాటుకున్నాం" అని అమిత్ షా చెప్పారు. శుక్రవారం సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) వ్యవస్థాపక చీఫ్ రుస్తుంజీ -మిగతా 2లో

## ఏడుగురు సీఆర్‌పీఎఫ్ కమాండోలకు శౌర్యచక్ర ప్రదానం

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేసే క్రమంలో అమరులైన ఇద్దరు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లతోపాటు మరో ఐదుగురిని శౌర్య చక్ర పతకం వరించింది. గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పతకాలను అందజేశారు. మావోయిస్టులకు గట్టి పట్టున్న ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని టేకల్‌గూడలో 2024 జనవరి 30న సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ -మిగతా 2లో





## దేశంలో కొత్త కొవిడ్ వేరియంట్లు.. వెల్లడించిన ఇన్సాకాగ్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

కరోనా వైరస్ గురించి పూర్తిగా మర్చిపోతున్న తరుణంలో మరోసారి పంజా విసురుతోంది. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వైరస్ కేసులు వెలుగు చూస్తున్నాయి. కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడగా.. ఎల్ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులు మేలో గుర్తించినట్లు తెలిపింది. అవి తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి. దిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులను గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి దిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాంతో అన్ని ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది.

ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి -మిగతా 2లో

## అక్రమ చొరబాట్లపై ఏటీఎస్ నిఘా




(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 24)

రాష్ట్రంలో ఏర్పాటుచేసిన ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) పాత్ర చాలా కీలకంగా మారుతోంది. ప్రత్యేకించి చట్టవ్యతిరేక చర్యలతో పాటు ఉగ్రవాద కార్యకలాపాలపై లోతుగా నిఘా పెడుతున్నారు. తాజాగా పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్‌తో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని బలగాలు మరింత చురుగ్గా కదులుతున్నాయి. తాజాగా పాక్ నుంచి తమిళనాడుకు డ్రగ్స్ సరఫరా చేసే రాకెట్ను వెలుగులోకి తేవడంతో మరింత అప్రమత్తమయ్యారు. అన్ని జిల్లాల్లోని పోలీసులతో కలిసి అనుమానితులపై కన్నేసి ఉంచారు. పాక్ నుంచి కూడా చొరబాట్లు జరిగే అవకాశం తమిళనాడుకు ఉన్నట్లు తేలింది. అక్కడి నుంచి ఏకంగా రూ.1800 కోట్ల విలువైన 300 కిలోల మత్తుపదార్థాల్ని ఇక్కడికి తీసుకొచ్చి స్మగ్లర్లకు అందించాలనే కుట్రను భారత పోలీసులు భగ్నం చేశారు. గతనెలలో అరేబియా సముద్ర తీరంలో గుజరాత్ ఏటీఎస్ అధికారులు, తీరగస్తీదళాలు ఈ స్మగర్లను పట్టుకున్నాయి. విచారణలో తేలిందేంటంటే.. ఆ మత్తుపదార్థాల్ని సముద్రమార్గం -మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి

# అమరావతిని రాజధానిగా నోటిపై చేయండి

భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ? హైదరాబాద్ వంటి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కు అవసరం లేదా? తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇవన్నీ మరిచిపోయి మూర్ఖంగా మాట్లాడే వ్యక్తులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజధానికి భూములు త్యాగం చేసేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోరని భరోసా ఇచ్చాం. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి అని అలాగే ఉంచుకుంటే మీరు అక్కడే ఉంటారు, రాజధానికి ఇస్తే చరిత్ర తిరగరాస్తారు, మీ జీవితాలు కూడా మెరుగుపడతాయని చెప్పడంతో ఇచ్చారు. అమరావతి శక్తి చాలా బలమైంది' అని చంద్రబాబు అన్నారు.

**బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు రావాలి**

'మేం బెంగళూరుకు మించిన ఎయిర్‌పోర్టు అమరావతికి రావాలని కోరుకుంటున్నాం. దానికి రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు పెట్టదు. ఇన్వెస్టర్లే కడతారు. దాని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అమరావతికి అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. విశాఖను అత్యుత్తమ నగరంగా మార్చడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నాం. దాన్ని ఆర్థిక, విజ్ఞాన నగరంగా అభివృద్ధి చేస్తాం' అని సీఎం ప్రకటించారు.

**సంపద సృష్టించేది ప్రభుత్వ విధానాలే**

దేశంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కావాల్సింది మంచి ప్రభుత్వ విధానాలే తప్పితే డబ్బు కాదని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఆర్థిక సంస్కరణల తర్వాత గ్రోత్ రేట్ అసాధారణంగా పెరిగింది. ప్రభుత్వ విధానం కింద ఐటీని ప్రోత్సహించడం వల్ల మనకు విస్తృత ప్రయోజనం దక్కింది. సాధారణంగా అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ వచ్చినప్పుడు కేంద్రం ఎంత డబ్బులు ఇస్తుంది? అని అందరూ అడుగుతుంటారు. ఇక్కడ సంపద సృష్టించడానికి సరైన ప్రభుత్వ విధానాలు కావాలి. 20 ఏళ్ల క్రితం మన ఎయిర్‌పోర్టులు ఎలా ఉండేవో తెలుసుకదా.. వాటికి భిన్నంగా మేం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. దాని గురించి ప్రతిపాదించినప్పుడు డబ్బులు ఎక్కడున్నాయని నాటి ప్రధానమంత్రి వాజపేయి కూడా అడిగారు. అప్పుడు మేం డబ్బు అవసరం లేదు.. అడిగిన పాలసీ ఇవ్వండి అని కోరాం. మీకు ఆసక్తి ఉంటే అందులో కేంద్ర ప్రభుత్వం తరఫున వాటా పెట్టుకోండి, లేకపోతే అదికూడా వద్దని చెప్పాం. ప్రభుత్వ వాటా ఉంటే అక్కడ జరిగే వాణిజ్యంలో మీకూ ఆదాయం వస్తుందని తెలిపాం.

ఆ ఎయిర్‌పోర్టును సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో 32 సమావేశాలు నిర్వహించాం. అప్పట్లో పౌర విమానయాన శాఖ మంత్రి కూడా ఆ విధానానికి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడారు. అయినా పోరాడటంతో చివరగా ప్రధాని వాజపేయి ఆమోదించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు తెలంగాణ వృద్ధి రేటులో 17% వాటా సమకూరుస్తోంది. ఆ తర్వాతే బెంగళూరు, దిల్లీకి కొత్త ఎయిర్‌పోర్టులు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు బెంగళూరు ఎయిర్‌పోర్టు టెర్మినల్-2 ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా మారింది. అందులో ప్రభుత్వమేమీ డబ్బులు పెట్టలేదు. కానీ దాని ద్వారా ప్రభుత్వానికే ఆదాయం వస్తోంది. ఆ ఎయిర్‌పోర్టు టెర్మినల్-2 ఇప్పుడు అనుభవ కేంద్రంగా మారింది. అందువల్ల సంపద సృష్టికి ప్రభుత్వ విధానాలే అత్యంత ముఖ్యం. అమరావతినీ ఇదే విధానంలో తీసుకొచ్చాం. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు చేయలేదు' అని పేర్కొన్నారు.

**ఆర్‌డీటీకి విదేశీ నిధుల సమస్యపై చర్చించా**

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో శాంతిభద్రతలు, నేర నివారణలో టెక్నాలజీ వినియోగం, కొత్త నేర న్యాయ చట్టాలపై సమీక్ష జరిగిందని చంద్రబాబు వివరించారు. ఇప్పటివరకు 24 రాష్ట్రాలపై ఆయన సమీక్షించారని, అందులో భాగంగానే ఏపీలోని పరిస్థితులపై చర్చించారని తెలిపారు. రాయలసీమలోని ప్రముఖ సేవా సంస్థ ఆర్‌డీటీకి విదేశీ నిధులు ఆగిపోయిన విషయం గురించి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పేదలకు విశేష సేవలందిస్తున్న ఆ సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ లేఖ అందించానని, దాన్ని. పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

# టాలీవుడ్‌కు పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా, కనీసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు కూడా సినీ ప్రముఖులు ముందుకు రాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సినీ రంగాన్ని, అగ్ర నటులను ఏ విధంగా ఇబ్బందులకు గురి చేసిందో అప్పుడే మరిచిపోయారా అని ప్రశ్నించారు.

తమ ప్రభుత్వం వ్యక్తులను కాకుండా, పరిశ్రమ అభివృద్ధిని మాత్రమే దృష్టిలో ఉంచుకుంటుందని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమ నుంచి అందిన ఈ 'రిటర్న్ గిఫ్ట్'ను తగిన రీతిలోనే స్వీకరిస్తానని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

తమ డిమాండ్లు నెరవేర్చకపోతే జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేస్తామంటూ ఇటీవల ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు చేసిన హెచ్చరికలు, ఆ తర్వాత ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన చర్చల అనంతరం అలాంటిదేమీ లేదని ప్రకటించిన పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**గత ప్రభుత్వ ఇబ్బందులు మర్చిపోయారా?**

"ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమను అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, తెలుగు సినీ రంగంలోని వారికి ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా, ఒక్కసారి కూడా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబును కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సమయంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం ఒక్కసారి కూడా రాలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు."అందరూ కలిసి రావాలి అని పిలుపునిచ్చినా సానుకూలంగా స్పందించలేదు. అగ్ర నటులు, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించిందో అందరూ మర్చిపోయారు. నాటి ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా?" అని ప్రశ్నించారు.

**ఇకపై వ్యక్తిగత విజ్ఞప్తులు కుదరవు**

"ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు 'అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు' అని చెప్పాను. అయినా, ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకు అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది. మీరు ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తా. ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తా. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తా" అని స్పష్టం చేశారు.

**థియేటర్ల నిర్వహణ, సౌకర్యాలపై ఆరా**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సినిమా థియేటర్ల నిర్వహణ, ప్రేక్షకులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత శాఖలతో సమీక్షించారు. సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలు అధికంగా ఉండటం, తాగునీటి సదుపాయం సరిగా లేకపోవడం వంటి అంశాలపై ప్రేక్షకుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై దృష్టి సారించారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లోని మల్టీప్లెక్స్‌ల నిర్వహణ, టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సినిమా రంగంలోని 24 విభాగాల్లో నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ యోచిస్తున్నట్లు సమాచారం.

# కపటత్వ ప్రదర్శనలో పాక్ ఆరితేరింది: భారత్

**ఉగ్రదాడుల్లో 20వేల మంది మృతి..**

"65 ఏళ్ల క్రితం భారత్ చిత్తశుద్ధితో పాక్‌తో సింధు జలాల ఒప్పందం కుదుర్చుకుంది. ఆరున్నర దశబ్దాల్లో పాకిస్థాన్ మూడు యుద్ధాలు చేసి ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. వేల మంది ఉగ్రవాదులు మాపై దాడులు చేశారు. గత నాలుగు దశాబ్దాల్లో ఉగ్రవాదులు చేసిన దాడుల వల్ల భారత్‌లో 20 వేల మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ.. భారత్‌లోని పౌరుల జీవితాలను, మత సామరస్యాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తోంది. ఒప్పందం జరిగినప్పటినుంచి ప్రాథమికంగా పలు మార్పులు చోటుచేసుకున్నాయి. గత రెండేళ్లుగా ఒప్పందంలో సవరణలు చేయాలని పాక్‌ను భారత్ కోరినప్పటికీ.. దాయాది దేశం వాటిని తిరస్కరించింది. మా చట్టబద్ధమైన హక్కులు వినియోగించుకోవడానికి వీల్లేకుండా అవరోధాలు సృష్టించింది. వీటన్నింటిని సహించలేకే సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేశాం. ఉగ్రవాదానికి ఆ దేశం మద్దతునివ్వడం ఆపేసేవరకు ఇది కొనసాగుతోంది" అని హరీశ్ వివరించారు.ఈసందర్భంగా ఇటీవల ఘర్షణల సమయంలో భారత పౌరులే లక్ష్యంగా పాక్ దాడులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దాయాది దేశం దాడుల్లో 20 మందికి పైగా మృతి చెందగా.. 80 మందికి పైగా గాయపడ్డారని పేర్కొన్నారు. గురుద్వారాలు, దేవాలయాలు, సైనిక స్థావరాలను కావాలనే లక్ష్యంగా చేసుకొందని తెలిపారు. వాటిని మన బలగాలు సమర్థమంతంగా తిప్పికొట్టిన విషయాన్ని వెల్లడించారు. ఇలాంటి ప్రవర్తన కలిగిన ఆ దేశం కపటత్వాన్ని ప్రదర్శిస్తూ బోధనలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం కలిసి పోరాడాలని, వారికి ఆశ్రయం కల్పిస్తూ రక్షణ కల్పించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్ పిలుపునిచ్చారు.

# ఆపరేషన్ సిందూర్ మన బలగాల సామర్థ్యాన్ని చాటిచెప్పింది

స్మారకోపన్యాసంలో అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. పాకిస్థాన్ ప్రోద్బలంతో పహల్గాంలో అమాయక పర్యాటకుల్ని మతపరంగా గుర్తించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అమానుషంగా హత్య చేయడం ద్వారా ఉగ్రవాదులు పాపం చేశారని షా అన్నారు. దీనికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం చేశాం. అయితే ఈ దాడిలో పాక్ ప్రజలకు గానీ, ఆ దేశ సైనిక స్థావరాలకు గానీ ఎలాంటి హాని కలిగించలేదు. ఉగ్రవాదులపై దాడిచేస్తే దానికి పాక్ స్పందించింది. వారు మన పౌరులపై దాడి చేయాలని చూశారు కానీ మన వాయు రక్షణ వ్యవస్థ ముందు విజయం సాధించలేకపోయారు" అని హోం మంత్రి తెలిపారు. 2.75 లక్షల సంఖ్యాబలం కలిగిన బీఎస్ఎఫ్ అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేస్తూ దేశంలోని రెండు సరిహద్దుల్ని కాపాడుతోందని ఆయన అన్నారు. సరిహద్దుల్లో కంచె నిర్మించలేని ప్రదేశాలను కాపాడేందుకు త్వరలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నామని అన్నారు.

# ఏడుగురు సీఆర్‌పీఎఫ్ కమాండోలకు శౌర్యచక్ర ప్రదానం

ఏర్పాటు ప్రారంభించింది. ఆ సమయంలో బారెల్ గ్రనేడ్ లాంఛర్లు, ఇంప్రొవైజ్డ్ మిస్సైల్‌తో మావోయిస్టులు విరుచుకుపడ్డారు. తమ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా 201 కోబ్రా బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ పవన్‌కుమార్ తోటి కానిస్టేబుల్ దేవన్‌తో కలిసి తెగువతో పోరాడారు. ఈ క్రమంలో వారు అమరులయ్యారు. వారి అసాధారణ ధైర్యం, పరాక్రమానికి మరణానంతం శౌర్యచక్ర లభించింది. ఈ వీరుల కుటుంబ సభ్యులకు రాష్ట్రపతి పతకం అందజేశారు. ఇదే కోబ్రా యూనిట్‌కు చెందిన డిప్యూటీ కమాండెంట్ లఖ్వీర్, అసిస్టెంట్ కమాండెంట్ రాజేశ్ పంచల్, కానిస్టేబుల్ మల్కిత్ సింగ్ తాము చూపిన అసాధారణ ధైర్యానికి శౌర్యచక్ర పతకం అందుకున్నారు. లఖ్వీర్ పేలుళ్లలో గాయపడగా పంచల్ కుడి చేతికి తూటా తగిలింది. పవన్ కుమార్ మృతదేహం కోసం ఛాతికి గాయమైనా మల్కిత్ సింగ్ తుపాకీ గుళ్లకు ఎదురెళ్లి ఎంతో మంది మావోయిస్టులను కాల్చిచంపాడు. 2023 ఏప్రిల్ 3న ఝూర్ఖండ్ ఛత్రా జిల్లా జరిగిన మరో ఆపరేషన్‌లో పరాక్రమం చూపిన సీఆర్పీఎఫ్ 203 కోబ్రా బెటాలియన్‌కు చెందిన డిప్యూటీ కమాండెంట్ విక్రాంత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ జెఫ్రీ హమింగ్‌చుల్లో శౌర్యచక్ర అందుకున్నారు. మావోయిస్టులతో 50 నిమిషాలపాటు జరిగిన భీకర పోరులో వీరు ఐదుగురు మావోయిస్టు అగ్రనేతలను చంపారు.

# దేశంలో కొత్త కొవిడ్ వేరియంట్లు.. వెల్లడించిన ఇన్సాకాగ్

అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు.

దిల్లీలో కేసులతో అక్కడి భాజపా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు ఇమ్యూనిటీ తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

# ఈశాన్య భారతం ఓ పవర్‌హౌస్

'ఆపరేషన్ సిందూర్' విజయంలో ప్రధాని నాయకత్వ పటిమను కొనియాడుతూ.. సెల్యూట్ చేస్తున్నా అన్నారు. ఉగ్రవాదంపై భారత్ ఐకమత్యం, స్థిరత్వం, దృఢ సంకల్పంతో పోరాడుతోందన్నారు. మన సాయుధ దళాల శౌర్య పరాక్రమాలకు గర్వపడుతున్నట్లు తెలిపారు.

# రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిపై సమగ్ర చర్చ

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 24)**

గత ఐదేళ్లలో అన్ని రంగాల్లోనూ వెనకబడిన రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై కడపలో జరగనున్న 'మహానాడు' వేదికపై సమగ్రంగా చర్చించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అలాగే రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలపైనా నేతలు ప్రత్యేకంగా చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన 14 ముసాయిదా తీర్మానాలు, నాలుగు ఉమ్మడి తీర్మానాల్ని చర్చించి ఆమోదించనున్నారు. మొదటిరోజు ప్రతినిధుల సభ జరుగుతుంది. ఇందులో పార్టీ సంస్థాగత నిర్మాణం, సిద్ధాంతాలు, భవిష్యత్తు కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. రెండోరోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సాధించిన విజయాలు, మ్యానిఫెస్టో అమలు, గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. పింఛన్ల పెంపు, దీపం-2, అన్న క్యాంటీన్లు, చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, తద్వారా యువతకు లభిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మెగా డీఎస్సీ తదితర అంశాలపై కూలంకషంగా చర్చిస్తారు.

# 3 దేశాల నేతలతో భారత ఎంపీల భేటీ

భారత ప్రతినిధుల బృందం శుక్రవారం రష్యా ఫెడరేషన్ అసెంబ్లీ (పార్లమెంట్)లో ప్రాతినిధ్యం గల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో విస్తృత చర్చలు నిర్వహించింది. ఈ సందర్భంగా రష్యా బృందానికి లిబరల్-డెమోక్రటిక్ పార్టీకి చెందిన అంతర్జాతీయ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు లియోనిడ్ స్లుట్స్కీ నేతృత్వం వహించారు. కమిటీ డిప్యూటీ ఛైర్మన్ ఆండ్రీ డెనిసోవ్ సహా రష్యన్ ఫెడరేషన్ కౌన్సిల్ సెనేటర్లతో భారత బృందం భేటీ అయ్యింది. ఈ మేరకు రష్యాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. భారత బృందానికి స్మోలెన్స్కాయ స్క్వేర్‌లోని భారీ భవనంలోకి రష్యా విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి ఆండ్రీ రుడెన్కో సాదర స్వాగతం పలికారు.

**ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు**

జపాన్‌లో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందం శుక్రవారం ఆ దేశ అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) సభ్యులతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనుసరిస్తున్న దృఢ వైఖరిని వారికి వివరించింది. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం జపాన్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎల్‌డీపీకి చెందిన ఉగ్రవాద నిరోధక పరిశోధక కమిటీ అధ్యక్షుడు, న్యాయశాఖ మాజీ మంత్రి యసుహిరో హనాషితో ఝా బృందం భేటీ అయ్యింది. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయని జపాన్‌లో భారత రాయబార కార్యాలయం 'ఎక్స్'లో పేర్కొంది. శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని ఎంపీల బృందం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అన్వర్ గార్గాష్ డిప్లొమేటిక్ అకాడమీ డైరెక్టర్ జనరల్ నికోలే మ్లాడెనొవ్‌తో భేటీ అయ్యింది. అంతకుముందు బృంద సభ్యులు షేక్ జయెద్ గ్రాండ్ మసీదు, బీఏపీఎస్ హిందూ దేవాలయం, గురునానక్ దర్బార్ గురుద్వారాలో ప్రార్థనలు నిర్వహించారని స్థానిక రాయబార కార్యాలయం 'ఎక్స్'లో వెల్లడించింది.

**గాల్లో చక్కర్లు కొట్టిన భారత ఎంపీల విమానం**

మాస్కో: డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలో భారత అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధుల బృందానికి గురువారం రాత్రి రష్యాలో అనూహ్య అనుభవం ఎదురైంది. వీరి విమానం దిగడానికి ముందు మాస్కో ఎయిర్‌పోర్టు సమీపంలో కీవ్ డ్రోన్ దాడికి పాల్పడింది. దీంతో విమానాశ్రయాన్ని కొన్ని గంటల పాటు తాత్కాలికంగా మూసివేశారు. భారత ప్రతినిధుల బృందం ప్రయాణిస్తున్న విమానం గాల్లోనే చక్కర్లు కొట్టి 40 నిమిషాల తర్వాత సురక్షితంగా దిగింది.

# అక్రమ చొరబాట్లపై ఏటీఎస్ నిఘా

ద్వారా తమిళనాడుకు తరలించేందుకు తీసుకొచ్చినవని. పాకిస్థాన్‌లోని పస్నీ పోర్టు నుంచి ఓ బోటులో వాటిని తీసుకొచ్చారు. రాత్రి సమయాల్లో తీరగస్తీదళాల కళ్లుగప్పి తరలించాలనుకున్నా.. ఆ ప్రయత్నాల్ని ఏటీఎస్, తీరగస్తీదళాలు అడ్డుకున్నాయి. మత్తుపదార్థాల్ని రహస్యంగా తమిళనాడుకు ఎందుకు తీసుకెళ్లాలనుకున్నారు, అసలు పాక్‌కు, ఇక్కడి స్మగ్లర్లకు ఉన్న సంబంధాలేంటి.. తదితర విషయాలపై కూపీ లాగుతున్నారు. ఇదే విషయంపై తమిళనాడు ఏటీఎస్ పోలీసులు సైతం ఆరా తీస్తున్నారు.

**గుజరాత్‌లో పాక్ స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలతో తీరగస్తీ దళాలు**

నిందితుల పట్టివేతలో..ఈ మధ్యే కృష్ణగిరి జిల్లా హోసూరులో మోస్ట్ వాంటెడ్ నక్సల్ సంతోష్‌ను తమిళనాడు, కేరళ ఏటీఎస్ బలగాలు సంయుక్తం నిర్వహించిన ఆపరేషన్‌లో పట్టుకున్నాయి. ఇతనిపై ప్రస్తుతం జాతీయ దర్యాప్తు బృందాలు నిఘా కొనసాగుతోంది. కేరళలోని వయనాడ్ అడవుల్లో చురుగ్గా ఉన్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)లో సంతోష్ సభ్యుడిగా ఉండటంతో చాలా ఏళ్లుగా అతనికోసం పోలీసులు గాలిస్తున్నారు. మిగిలినివారిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేసినా సంతోష్ తప్పించుకుని తమిళనాడు వచ్చేశాడు. ఇప్పుడు పట్టుకుని జైలుకు పంపారు. ఫలితంగా కేరళలో నక్సల్ ప్రభావం బాగా తగ్గే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

2012లో జరిగిన బాంబుదాడికి సంబంధించి కీలక నిందితుడ్ని పట్టుకోవడంతో పాటు జైలుశిక్ష పడేలా చేయడంలో రాష్ట్ర ఏటీఎస్ సఫలమైంది. కోయంబత్తూరు, నాగర్‌కోవిల్ కేసులకు సంబంధించిన ఐదుగురు నిందితుల్ని ఈ దళం పట్టుకుంది. రెండేళ్లగా వారు దొరక్కుండా తిరుగుతుండటంతో నిఘాపెట్టి మరీ పట్టుకున్నారు. మరోవైపు రాష్ట్రంలో అక్రమంగా తుపాకులు పట్టుకుని తిరుగుతున్నవారినీ అరెస్టు చేస్తున్నారు. ఇతర అక్రమ కార్యకలాపాలపైనా ఈ పోలీసులు రాష్ట్రంలోని వివిధ ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నారు.

**నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసిన కరూరు ముఠా సభ్యులు**

**అక్రమ వలసలపై..**

విదేశీయులు అక్రమంగా తమిళనాడుకు వచ్చి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం మరో ఇబ్బందికర పరిణామంగా దాపురించింది. ఏటీఎస్ పోలీసులు పలుమార్లు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కోయంబత్తూరు, తిరుప్పూరులో ఈ ఏడాది జనవరిలో 59 మందిని పట్టుకున్నారు. తాజాగా పహల్గాం దాడి నేపథ్యంలో మరికొంతమంది అక్రమ వలసదారుల్ని అదుపులోకి తీసుకుంటున్నారు. మరింతమంది ఉండే అవకాశముందని నిఘా పెట్టారు. విదేశీయులకు దొంగ ఆధార్ కార్డులిస్తున్నారనే అనుమానంతో తాజాగా కరూరులో దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారినుంచి 130 నకిలీ పాన్‌కార్డులు, 69 నకిలీ ఆధార్‌కార్డులు, పలు సాంకేతిక పరికరాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఏయే జిల్లాల్లో ఈ పరిస్థితులున్నాయనే దానిపై రహస్యంగా ఆరా తీస్తున్నారు.

**బలోపేతం దిశగా..**

ఉగ్రవాద నిరోధక దళాన్ని(ఏటీఎస్) రాష్ట్రంలో 2024లో ఏర్పాటుచేశారు. చెన్నై, కోయంబత్తూరు, మదురై కేంద్రంగా ఈ బృందాలకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లను అప్పగించారు. ఉగ్రవాద కార్యకలాపాలపై దర్యాప్తు చేసే అధికారాల్ని వారికిచ్చారు. చెన్నై కేంద్ర కార్యాలయంగా ఏర్పాటు చేయడంతో పాటు మొత్తంగా ఈ దళంలో 384 మంది మందిని ఇచ్చారు. ఒక డీఐజీ, నలుగురు ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీలు, 14మంది డీఎస్పీలు, 32మంది ఇన్‌స్పెక్టర్లు, 73మంది ఎస్ఐలు, మరో 255 మంది పోలీసులు ఇందులో ఉన్నారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు నిఘాపరంగా సాంకేతిక సహకారం అందిస్తున్నారు.

# ప్రమాదంలో లైబీరియా నౌక

**తిరువనంతపురం/కొచ్చిన్. మే 24**




లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం ప్రమాదంలో చిక్కుకుంది. 26 డిగ్రీల మేర ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో నౌకలోని చమురు కంటెయినర్లలో కొన్ని సముద్ర జలాల్లో పడిపోయాయి. కంటెయినర్లను, అందులోంచి బయటకు వచ్చిన ఇంధనం తీరంవైపునకు వస్తే తాకొద్దని ప్రజలకు కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రక్షణశాఖ వెల్లడించిన వివరాలు ప్రకారం.. విఝింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా 3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉంది. ఆ నౌక ప్రమాదంలో చిక్కుకుందని సమాచారం అందడంతో తీర రక్షక దళం సహాయక చర్యలు ప్రారంభించింది. హెలికాప్టర్లు కూడా రంగంలోకి దిగాయి. నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నారు. 21 మందిని తీరరక్షక దళం రక్షించింది.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 25.05.25
ఆదివారం




## ఒంగోలులులో ప్రముఖ సినీ దర్శకుడు

**సుకుమార్ సతీమణితో కలిసి హల్ చల్**

**ఎలైట్ టీవీఎస్ షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న దర్శక దిగ్గజం**

**సుకుమార్‌ను చూసేందుకు ఎగబడ్డ జనం** (తరువాయి 4లో...)


షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం


# చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజారపు అచ్చంనాయుడు

(షణ్ముఖ వెలుగు బ్యూరో, బాపట్ల, మే 24)

పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీ ని చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజారపు అచ్చంనాయుడు అన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం మార్టూరు మండలంలోని పర్చూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. సుదీర్ఘ చర్చ అనంతరం బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి ప్రకటించారు. బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. కామన్ వెరైటీ క్వింటా ధర రూ.12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని రూ.6,000లతో కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలలో హెచ్చు, తగ్గులు ఉన్నప్పటికీ నిర్ణయించిన ధరను అమలు చేయాలని కంపెనీలకు సూచించారు. పొగాకు కొనుగోలులో ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే మార్క్ ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించారు. చివరి ఆకు వరకు రైతులు పండించిన పొగాకు పంటను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వాని దేనన్నారు. ఇందుకోసమే ఆరు సబ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కంపెనీలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కంపెనీల వద్ద సిబ్బంది లేకపోతే ప్రభుత్వ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. వేర్ హౌసింగ్ గోడౌన్లను వినియోగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.సంక్షోభం నుంచి రైతులను బయటకు తెచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి అచ్చంనాయుడు చెప్పారు. కంపెనీలు కథలు చెప్పడం మాని రైతులకు మేలు చేసే ఉద్దేశంతో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కంపెనీలు స్పందించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారనే విషయాలను గుర్తించాలన్నారు. బయ్యర్లుగా ఉన్న కంపెనీలు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. సాధారణంగా 25 మిలియన్ కిలోల పొగాకు సాగు చేయాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 75 మిలియన్ కిలోల పొగాకు సాగు చేపట్టినట్లు తెలిపారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లో కొంత డిమాండ్ తగ్గడమే సంక్షోభానికి కారణమని వివరించారు. మిర్చి, కొబ్బరి, బ్లాక్ బర్లీ, మామిడి పంటలు సంక్షోభంలోకి కూరుకుపో పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రైతులకు ధైర్యం కల్పించాలి, వారి కొరకు కంపెనీలు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. రైతు పక్షపాత ప్రభుత్వంగా రైతుల వెంట నిలిచిందన్నారు. ఆత్మహత్యల మాట ఈ ప్రభుత్వంలో వినపడరా దన్నారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.130కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిం దన్నారు. ఇటీవల సంక్షోభంలోకి వెళ్లిన టమోటా రైతులను ఆ నిధి నుంచి ఆదుకున్నామన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, రైతులు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను బయ్యర్లు రేపటి నుండే కొనుగోలులు ప్రారంభించాలన్నారు. ఇలాంటి పరిస్థితి రానున్న రోజుల్లో కనిపించరాదని, ప్రత్యామ్నాయ పంటల వైపుకు రైతులు వెళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు చైతన్య పరచాలన్నారు.సంక్షోభం లాంటి ఇబ్బందులు వచ్చినప్పుడే





రైతులను ఆదుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కంపెనీల ప్రోత్సాహంతోనే బ్లాక్ బర్లీ పొగాకును రైతులు సాగు చేశారని, చివరి ఆకు వరకు కొనేలా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. ఆత్మహత్యలు అనే మాట వినపడరాదు, అలాంటి ఆలోచన రైతుల్లోకి రాకూడదన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం నిలిచిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో కంపెనీలు ముందుకు రావాలి కోరారు. సమస్యల్లో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. వచ్చే ఏడాది పొగాకు పంట సాగు తగ్గించేలా అధికారులు ప్రణాళికలు పొందించుకోవాలన్నారు. రైతుల బాగుంటేనే, కంపెనీలు, కంపెనీలు బాగుంటేనే మీరూ ఇలా ఒకరికొకరు సంయమనంతో ముందుకు సాగాలన్నారు. ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, మంత్రి ప్రకటించడంతో ఐటిసి 10 మిలియన్ కు మించి కొనుగోలు చేయాలని, జిపిఐ కంపెనీ 20 మిలియన్లకు పైగా కొనుగోలు చేయాలన్నారు. అలాగే మిగిలిన కంపెనీలు లక్షాలకు మించి పొగాకు కొనుగోలు చేపట్టాలన్నారు. బయ్యర్లు ముందుకు వచ్చి రైతులను ఆదుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన వివరించారు. సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం కాపాడుతుందని, ఆఖరి కిలో సైతం పొగాకు కంపెనీలు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ హామీ ఇచ్చారు.

రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేపిస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చిందన్నారు. రైతుల శ్రమను ప్రభుత్వం గుర్తించిందన్నారు. మంచి ధరలతో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. పొగాకు రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. మంత్రి ప్రకటించిన ధరలతో కంపెనీలు ముందుకు వచ్చి పొగాకు పంటను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ, ధరల అమలుపై నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రభుత్వం కేటాయించిన మేరకు కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయా లేదా నిరంతరం పరిశీలిస్తామన్నారు. సంక్షోభంలో ఉన్న పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చెప్పారు. రెండు గ్రేడ్లతోనే పొగాకు కొనుగోలు జరగాలన్నారు. పర్యవేక్షణ సెల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టే విధి విధానాలను ఆయన వివరించారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా కంపెనీలు ముందుకు రావాలని ఆయన కోరారు.బ్లాక్ బర్లీ పొగాకు సాగుతో తీవ్రంగా నష్టపోయామని, కనీస మద్దతు ధర అమలు చేయాలని ఇంకొల్లు దుద్దుకూరు రైతులు హరిబాబు, వాసు బాబు, కె.వెంకట సుబ్బారావు, సూది సుబ్బారావు, మహిళా రైతు రమాదేవి, జె పంగులూరు మండలం రైతులు రావూరి రమేష్ బాబులు కోరారు. న్యాయం చేయాలంటూ మంత్రి వద్ద అభ్యర్థించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఈడి విశ్వసే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి సురేష్, సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మార్క్ ఫెడ్ అధికారి కరుణ, ఉద్యాన శాఖ ఏడి జెన్నమ్మ, 20 కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# నాగార్జునసాగర్ కుడికాలువ నీళ్లు తాగునీటికి వినియోగించుకునేలా చూడాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)



నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేసిన నీళ్లను కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ దిశగా పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీస్, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ , మున్సిపల్, జల వనరుల శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఆమె ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నుంచి ఈనెల 23వ తేదీన నాలుగు టి.ఎం.సి.ల నీళ్లను అధికారులు విడుదల చేశారు. వీటిని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలు వినియోగించుకోవాల్సి ఉన్న నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు కాకుండా కేవలం తాగునీటి కోసమే వీటిని వినియోగిం చుకునేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. మోటర్ల ద్వారా వ్యవసాయ అవసరాల కోసం ఈ నీటిని ఎవరూ దొంగిలించకుండా కాలువగట్లపై గస్తీ నిర్వహించాలని ఆమె చెప్పారు. అవసరమైన తాగునీటి ట్యాంకులు, ఇతర వనరులకు సాగర్ నీటిని మళ్లించి జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# యోగ సాధన పై విస్తృతంగా అవగాహన

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో 10 లక్షల మందికి యోగ సాధన పై అవగాహన కల్పించేలా జిల్లా వ్యాప్తంగా యోగ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ప్రకాశం భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన యోగ రోడ్డులో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డిఓ లక్ష్మి ప్రసన్న, నగర కమీషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావులతో కలసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నంలో జరుపు కోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనుచున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 5 లక్షల మంది ప్రజలు పాల్గొంటారని కలెక్టర్ వివరించారు. జూన్ 21న అంతర్జాతీయ



# చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది









# చిట్టా బంగారురెడ్డికి నివాళులర్పించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 24)**
మండలంలోని కరేడు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టా బంగారు రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బంగారురెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.





# ఒంగోలులో ప్రముఖ సినీ దర్శకుడు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)**
ప్రముఖ సినీ దర్శకులు సుకుమార్ తన సతీమణితో కలిసి ఒంగోలులో హల్ చల్ చేశారు. ఒంగోలులోని ట్రంకు రోడ్డులోని మినీ స్టేడియం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఎలైట్ టీవీఎస్ షో రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ తనకు ఎంతో కావలసిన వ్యక్తి షోరూమ్ ఎండీ కార్తీక్ రెడ్డి అని, ఆయన కోసమే ఒంగోలుకు రావడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ప్రపంచ స్థాయి టీవీఎస్ మోటార్ బైక్‌లను ఎలైట్ టీవీఎస్ షో రూమ్ లోనే కొనుగోలు చేసి తన మిత్రుడిని ఆశీర్వదించాలని కోరారు. సినిమాల గురించి మాట్లాడేందుకు విముఖత చూపారు. టీవీఎస్ కంపెనీ జీఎం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టీవీఎస్ బైక్‌లను అందించేందుకు నూతనంగా షో రూంలో ప్రారంభించడం జరిగిందన్నారు. షో రూంలో బైక్ ల సర్వీసింగ్ తో పాటు, అన్ని రకాల ఒరిజినల్ స్పేర్ పార్ట్స్ లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముందుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు షో రూంను సందర్శించి యాజమాన్యానికి తన అభినందనలు తెలిపారు.

# యోగ సాధన పై విస్తృతంగా అవగాహన



యోగా దినోత్సవంను పురస్కరించుకొని యోగా మంత్‌గా రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. అందులో భాగంగా జిల్లాలో 10 లక్షల మందికి యోగ సాధనపై అవగాహన కల్పించేలా జిల్లా వ్యాప్తంగా రోజుకొక కార్యక్రమంతో యోగ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రధాన మునిసిపాలిటీలలో, మండల కేంద్రాల్లో ఒక రోడ్డును యోగ రోడ్డుగా ప్రకటించి ఆ రోడ్డులో ప్రతి రోజు ఉదయం యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యోగా సాధన చేసేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో 100 మంది మాస్టర్ ట్రైనర్స్‌ను గుర్తించి వారికి ఓరియంటేషన్ కార్యక్రమాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అలాగే మండల స్థాయిలో 200 మంది ట్రైనర్స్ ను గుర్తించి వారికి ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ యోగా రోడ్డు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ శాఖ సిబ్బంది, యోగ సాధకులు, తదితరులు పాల్గొన్నారు.







# పార్టీ మారినంత మాత్రాన బాలినేని పాపాలు ఎక్కడికి పోతాయి

ఏం వ్యాపారం చేశారని బాలినేనికి ఇన్ని కోట్ల ఆస్తులు
అవినీతికి కేరాఫ్ అడ్రస్
కూటమి ధర్మాన్ని దామచర్ల ఎక్కడ తప్పలేదు
కూటమిలో చిచ్చు పెట్టేందుకే జగన్ బాలినేనిని జనసేనలో చేర్చారు
జనసేనలో చేరకపోతే ఈ పాటికి బాలినేని
మాజీ మంత్రులు వంశీ, కొడాలి నాని, బోరుగడ్డ అనిల్‌తో పాటు జైలులో ఉండేవారు
దామచర్ల గురించి మాట్లాడే స్థాయి బాల నాగేంద్రానికి లేదు
మీడియా సమావేశంలో టిడిపి నాయకుల ఫైర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)

పార్టీ మారినంత మాత్రాన మాజీ మంత్రి బాలినేని చేసిన పాపాలు పోతాయా అంటూ టిడిపి నాయకులు ఫైర్ అయ్యారు. ఒంగోలులోని టిడిపి కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బండారు మదన్ మాట్లాడుతూ జడ బాల నాగేంద్రం బాలినేని ఎంగిలి మెతుకులు తిని బతికే రకం అన్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చాలామందిని మోసం చేసి ఒంగోలు వదిలిపెట్టి పారిపోయిన వ్యక్తి అన్నారు. బ్యాంకులలో ఉన్న పొలాలు, స్థలాలు తక్కువ ధరలకే ఇప్పిస్తానంటూ ఎంతో మందిని మోసం చేసిన వ్యక్తి అన్నారు. అటువంటి వ్యక్తి బాలినేనికి అనుకూలంగా ఎమ్మెల్యే దామచర్లపై అవాకులు చవాకులు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. డొక్కా సీతమ్మ అన్నదానం పేరుతో వసూలు చేసింది జడ బాల నాగేంద్రం అని విమర్శించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన బాలినేని వకల్తా పుచ్చుకొని జడ మాట్లాడటం సిగ్గు పడాల్సిన విషయమన్నారు. 2019-24 ప్రాంతంలో ఒంగోలులోని బార్ అండ్ రెస్టారెంట్లు సిండికేట్ ద్వారా దాదాపు రూ.3 కోట్లు వసూలు చేసింది బాలినేని కాదా అని ప్రశ్నించారు. నెల్లూరు ఇసుక యదేచ్ఛగా విక్రయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. రూ.40 కోట్ల విలువైన ఎరజర్ల కొండ మట్టి మీ బావమరిది విల్లాలకు అక్రమంగా తరలించింది మీరు కాదా అన్నారు. నాకు రావలసిన బిల్లులు ఆపి నాకడుపు కొట్టింది మీరు కాదా అన్నారు. బాలినేని ఒంగోలుకు పట్టిన చీడ అన్నారు. సివిఎన్ రీడింగ్ రూమ్ లో పేకాట ఆడుతూ గడిపింది బాలినేని కాదా అన్నారు. బాలినేనికి రాజకీయ బిక్ష పెట్టింది అతని బావ వై వి సుబ్బారెడ్డి కాదా అన్నారు. దామచర్ల కుటుంబానికి వ్యాపారాలు ఉన్నాయని, నేటికీ వారి కుటుంబం వ్యవసాయం చేస్తుందని, 1962 నుండి దామచర్ల కుటుంబానికి కారు ఉందని గుర్తు చేశారు. మరి బాలినేని ఏం వ్యాపారాలు చేశారని కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మరో నాయకులు రాచగర్ల వెంకట్రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తల్లి నేటికీ నాయుడుపాలెం గ్రామంలో 30 ఎకరాల పొలాన్ని సాగు చేస్తున్నారన్నారు. కేవలం వారి వద్ద పనిచేసే వారికి ఉపాధి కల్పించేందుకే నేటికీ వ్యవసాయం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో చిచ్చు పెట్టేందుకే జగన్ బాలినేనిని జనసేనలో చేర్చారన్నారు. దామచర్ల ఎప్పుడు కూటమి ధర్మాన్ని అతిక్రమించలేదన్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యే అని చెప్పుకునే బాలినేని ఒంగోలుకు చేసింది ఏమీ లేదన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో బాలినేని సింగపూర్ శ్రీలంకలో పేకాట ఆడటం తప్ప ఒంగోలుకు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు అన్నారు. 2014-19 ప్రాంతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన దామచర్ల పోతురాజు కాలువ ఆధునీకరణ కోసం నిధులు తెస్తే, గత ఐదేళ్ల కాలంలో ఎటువంటి పనులు జరగని కారణంగా ఆ నిధులు వెనక్కి వెళ్ళాయని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాల కాలంలో బాలినేని, అతని అనుచరులు ఒంగోలులో 72 కబ్జాలకు పాల్పడ్డారన్నారు. ఇప్పటికీ బాధితులు ఎమ్మెల్యే కి అర్జీలు పెడుతున్నారని , తమకు న్యాయం చేయాలని కోరుతున్నారన్నారు. గత ఐదు సంవత్సరాలు కాలంలో టిడిపి నాయకులు, కార్యకర్తల పై పెట్టిన కేసులు, చేసిన దాడులు ఎలా మర్చిపోతామన్నారు. అమాయకులైన మహిళలపై దాడులు చేసిన చరిత్ర బాలినేనిది అని గుర్తు చేశారు. టిడిపి ఎస్సీ నాయకులు ఎద్దు శశికాంత్ భూషణ్ మాట్లాడుతూ ఏ సంవత్సరం ఏ పార్టీలో ఉంటారో తెలియని జడ బాల నాగేంద్రం ఎమ్మెల్యే దామచర్లను విమర్శించే స్థాయి కాదన్నారు. బాలినేని జనసేన పార్టీలో చేరకపోతే ఈపాటికే మాజీ మంత్రులు వల్లభనేని వంశీ, కొడాలి నాని, బోరుగడ్డ అనిల్ కుమార్ లా జైలులో ఉండేవారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దామచర్లపై అవాకులు చవాకులు మాట్లాడకుండా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ల వెంకటరత్నం, రాయపాటి అజయ్ బాబు, గోళ్ళ వెంకటేశ్వర్లు, షేక్ అజి మునిషా, తదితరులు పాల్గొన్నారు.

# పూడిక తీత పనులు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది






(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 24)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పొదిలి పట్టణ పరిధిలోని ఓబులశెట్టి వారి వీధి, అమ్మవారిశాల వీధులలో 40 ఏళ్ళ కింద నిర్మించిన కల్వర్టులు కుంగి పోవడం వలన మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న విషయం కాలనీ ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేకి, కమిషనర్‌కి తెలియజేయడంతో కమిషనర్ పరిశీలించారు. అలాగే మురుగు కాలువలోని మురికి నీరు రోడ్డు ఎక్కి ప్రవహిస్తున్న విషయం కమీషనర్ గ్రహించి ఓబులశెట్టివారి వీధి మేజర్ డ్రైన్ పూడిక 15 సంవత్సరాల క్రితం తొలగించినట్టుగా ప్రజలు చెప్పడంతో స్పెషల్ డ్రైవ్ క్రింద మురికి కాలువ మీద ఉన్న బండరాళ్లు తొలగించి పూడిక తొలగించే పనులు చేపట్టారు. ఈ పూడిక తీసే క్రమంలో షాపుల యజమానులు సహకరించాలని కోరారు. తాము చేసే ప్రతి పని మీ శ్రేయస్సుకు అని అర్థం చేసుకోవాలని ప్రజలను కోరారు. అలాగే ఓబులశెట్టివారి వీధి కల్వర్టు , అమ్మ వారిశాల వీధిలోని కల్వర్టు రెండు కొత్త కల్వర్టు నిర్మించుటలో భాగంగా పాత వాటిని తొలగించడం జరిగిందన్నారు. ఈ రెండు వీధుల ప్రజలు, వాహన దారులు ఇతర ప్రాంతాలకు వెళ్ళుటకు వేరే దారిని వినియోగించి, జాగ్రత్త వహించాలని తెలిపారు. పట్టణంలోని పెద్ద బస్ స్టాండ్ వద్ద ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ అందంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బల్లలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు బస్ షెల్టర్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేయవద్దని మనవి చేసారు. ఆటో, ఇతర వాహనదారులు బస్ షెల్టర్ ఎదురుగా దయచేసి పార్క్ చేయవద్దన్నారు. ఇది మనందరి ఆస్తి అని, ఇది ప్రజల డబ్బు అని అందరూ జాగ్రత్తగా చూసుకొనే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతీరావు, ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చెస్ పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 24)

ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి, అనంతరం పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలికితీసే క్రమంలో వారికి క్యారమ్స్ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.





# నక్కా గాలెయ్య సేవలు మరువలేనివి




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మే 24)

నక్కా గాలెయ్య సేవలు మరువలేనివని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ అన్నారు. నక్కా గాలెయ్య 6వ వర్ధంతి కార్యక్రమం సొంత గ్రామం గంగపాలెంలోని స్వగృహం నుంచి ర్యాలీగా నినాదాలతో స్థూపం దగ్గరికి చేరుకొని అక్కడ నక్కా గాలెయ్య స్తూపం దగ్గర నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నక్కా గాలెయ్య యర్రగొండపాలెం ఏరియాలో జరిగిన పోరాటాలలో పాల్గొని తన సేవలను అందించారన్నారు. అయ్యగానిపల్లి భూ పోరాటంలో భూములను పేదలకు పంచాలని జరిగిన పోరాటంలో కీలకంగా వ్యవహరించారన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు సాధనలో తన గ్రామము నుండి అనేక పోరాటాలలో పాల్గొని ప్రజలను ఈ ప్రాంతంలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలలో తనతో పాటు వారి సతీమణి వారి కుటుంబ సభ్యులను కూడా పాల్గొనేలా చేసిన ఆదర్శ కమ్యూనిస్టు నక్కా గాలెయ్య అన్నారు. ఈరోజు ఆయన లేకపోయినా వారి సతీమణి వారి కుమారుడు ఆయన ఆశయ సాధన కోసం పార్టీలోనే ఉంటూ మన వంతు సహకారం అందిస్తున్నారని ఆయన భవిష్యత్తులో ఈ ప్రాంతంలో జరిగే సీపీఐ చేస్తున్న పోరాటాల్లో సురుగుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ కృష్ణ గౌడ్, సీపీఐ సీనియర్ నాయకులు టిసిఎచ్ చెన్నయ్య, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, యర్రగొండపాలెం మండల సహాయ కార్యదర్శి నక్కా తిరుపతయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, మొగిలి చిన్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కరేడులో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 24)

ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో విపిఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజల అనంతరం స్విచ్ ఆన్ చేసి స్థానిక మహిళలకు స్వయంగా బిందెలతో నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, జనసేన నాయకులు గుడిహరి రెడ్డి, లింగ సముద్రం మండల గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, పార్టీ నాయకులు అడపా రంగయ్య బింకం శేషయ్య, అర్థాకుల బాబు, అడపా నరసయ్య వంకాయలపాటి మాల్యాద్రి, కిలారి కొండయ్య, గూడూరి కల్పన, బోయిళ్ళ కొండపనాయుడు, నీలం బ్రహ్మారెడ్డి, మద్దెల రామారావు, గొర్రెపాటి సాంబయ్య, పూరిమెట్ల గురునాథం, జనసేన నాయకులు అంగులూరి నరసింహారావు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, కరేడు గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాద్, శ్రీనివాసులు, చెంచురామిరెడ్డి, మెట్ట శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, బాల మురళి, జెట్టి సుబ్బరామిరెడ్డి, కత్తి శ్రీహరి, మండలాల్లో అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కూటమినేతలు, మహిళలు పాల్గొన్నారు.

# జగనన్న పోరుబాట విజయవంతం చేయాలి

## ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 24)**

పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పోరు బాట విజయవంతం చేయాలని వై పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం వైపాలెం వైసీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతర సమావేశంలో మాట్లాడుతు ఈ నెల 28న ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజక వర్గం పొదిలి పట్టణం లో పొగాకు రైతులకు అండగా జగన్న పోరుబాట విజయవంతం చేయాలని వైసీపీ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. అనంతరం జగనన్న పోరుబాట పోస్టల్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం వైసీపీ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

# యువత ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)**

నేటి యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం ఒంగోలులోని నాగార్జున డిగ్రీ కళాశాలలో మెప్మా, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యుల పిల్లలకు ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ మెప్మా సభ్యులకు ప్రత్యేకంగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలని సూచించారు. యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఎంతటి కష్టతరమైన పనికూడా విజయవంతం అవుతుందన్నారు. ఆ దిశగా ఉద్యోగం విషయంలో కూడా యువతీ, యువకులు ఒక లక్ష్యం, సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలనే సంకల్పం, లక్ష్యం ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సూచించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో ఈ రోజు ఏర్పాటు చేసిన జాబ్ మేళా కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో ప్లేస్మెంట్ రాకపోతే నిరాశ చెందక మరింత పట్టుదలతో సంకల్పంతో కృషి చేస్తే రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, కష్టపడితే ఫలితం ఉంటుంది అనే విషయాన్ని యువత కచ్చితంగా గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర రావు, మెప్మా పిడి శ్రీహరి, జిల్లా స్కిల్ డెవెలప్మెంట్ అధికారి రవి తేజ, నాగార్జున డిగ్రి కళాశాల చైర్మన్ రాంప్రసాద్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంపొందిచుకుంటూ, వచ్చిన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు సూచించారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 40 ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, 1200 నిరుద్యోగ యువత తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవడం జరిగింది. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో 10 ఎలెక్ట్రికల్ బైక్ లను, 10 ఎలెక్ట్రికల్ ఆటోలను స్వయం సహాయక సంఘాల సభ్యులకు జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాతతో కలసి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సిఈఓ శ్రీమన్నారాయణ, జిల్లా అర్బన్ సమాఖ్య ప్రతినిధి శ్రీమతి భారతి, స్వయం సహాయక సభ్యులు, వారి పిల్లలు తదితరులు పాల్గొన్నారు.









# రైతు శ్రేయస్సే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 24)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పొదిలి పట్టణంలో టొబాకో బోర్డును శనివారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సందర్శించారు. మొదటిగా టుబాకో బోర్డులో బేళ్లను పరిశీలించారు. అనంతరం సూపరింటిండెంట్ కార్యాలయంలో వివిధ పొగాకు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయా కంపెనీల యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ పొగాకు బోర్డును సందర్శించడం జరిగిందని, ఆయా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడటం జరిగిందని ఈ సోమవారం నుండి లో గ్రేడ్ బెళ్లను అందరూ ప్రతినిధులు అధిక సంఖ్యలో కొనుగోలు చేయనున్నారని, రైతులెవరు బాధపడవద్దు అని రైతులను కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులకు ఏ కష్టం వచ్చిన మీ వెన్నంటి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మార్కాపురం ఎఎంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, మాదిరెడ్డిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శివాలయం కమిటీ ప్రతిపాదిత చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ శివాలయం కమిటీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎం బాష, జిల్లా కార్యదర్శి షేక్ షబ్బీర్, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), కాటం రాజు, కొనకనమిట్ల మండల పార్టీ మాజీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి, తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.













# చారిత్రాత్మక నిర్ణయాలకు కడప మహానాడు వేదిక చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

## కడప మహానాడు ఏర్పాట్లు పరిశీలించిన చీఫ్ విప్ జీవీ, బీటెక్ రవి



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 24)

కడపలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు చారిత్రక నిర్ణయాలకు వేదిక కానుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వైసీపీ పాలనలో జగన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులకు కూడా నీళ్లు ఇవ్వలేక పోయారని ఎద్దేవా చేసిన ఆయన వారికి లక్షల కోట్లు దోచుకోవాలనే ఆలోచన తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఆ పరిస్థితులు మార్చి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు కొత్త చరిత్ర రాస్తున్న వివరాలు కూడా మహానాడు వేదికగా వెల్లడి స్తామన్నారు. కడప నగర సమీపంలోని పబ్బాపురం వద్ద 150 ఎకరాల్లో జరగనున్న మహానాడు వేడుక ఏర్పాట్లను శనివారం చీఫ్‌విప్ జీవీ పరిశీలించారు. మహానాడు జనసమీకరణ కో-కన్వీనర్, పులివెందుల నియోజకవర్గ జనసమీకరణ ఇన్ ఛార్జిగా ఉన్న ఆయన పులివెందుల తెదేపా ఇన్ ఛార్జి బీటెక్ రవితో కలిసి మహానాడు ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ నెల 25 నాటికి ఏర్పాట్లు పూర్తి కానున్నట్లు తెలిపారు. అనంతరం మాట్లాడిన రైతుల తలసరి ఆదాయం పెంచే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమలో అనేక ప్రాజెక్టులు చేపట్టి సాగునీరు అందించామన్న జీవీ తెలుగుదేశం గత ప్రభుత్వ హయాంలోనూ సీమ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వగలిగితే బంగారు పంటలు పండించగలుగుతారని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఈ 43వ వార్షికోత్సవానికి మరో ప్రత్యేకత కూడా ఉందన్నారు జీవీ. తెలుగుదేశం పార్టీ చరిత్రలో తొలిసారి కడప కేంద్రంగా మహానాడు జరుగుతుండటంతో రాయలసీమ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతేడాది ఎన్నికల్లో 94%స్థానాల్లో కూటమి విజయం సాధిస్తే సీమ ప్రాంతంలో అత్యధిక స్థానాలు కౌవసం చేసుకున్నామని, దానికి కృతజ్ఞతగా కడప గడ్డపై మహానాడు పండుగ జరుపుకుంటుకున్నామని తెలిపారు. 29న జరిగే భారీ బహిరంగ సభకు లక్షల్లో రాబోతున్నారని వెల్లడించారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై మహానాడు వేదికపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. అలాగే రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలపైనా చర్చించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన 14 ముసాయిదా తీర్మానాలు, నాలుగు ఉమ్మడి తీర్మానాల్ని చర్చించి ఆమోదించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మంత్రులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# జనసైనికులకు భరోసా కల్పించడమే ధ్యేయం

## జనసేన పార్టీ యువ నాయకులు కామిశెట్టి సాయిబాబు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 24)

క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీతో పాటు అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ లెటర్ ద్వారా పంపించిన ప్రత్యేక సందేశ పత్రాన్ని ప్రతి ఒక్క జనసైనికుడికి, వీరమహిళలకు గౌరవంగా అందచేయటం జరుగుతుందన్నారు. జన సైనికులకు, వీర మహిళలకు భరోసాని కల్పించడమే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ధ్యేయమని, జనసేన పార్టీ యువ నాయకులు కామిశెట్టి సాయిబాబు బాపట్ల పట్టణంలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వంతో పాటు ప్రమాద, జీవిత బీమా పొందవచ్చన్నారు. క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. భారతదేశంలోనే ఎటువంటి రాజకీయ పార్టీ ఈ కార్యక్రమాన్ని ఇప్పటి వరకు తలపెట్టలేదన్నారు. కార్యకర్తకు , కార్యకర్త కుటుంబానికి అండగా ఉండటం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాల కోసం జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తారని, అటువంటి కార్యకర్తకు ప్రమాదవశాత్తు జరగరానిది జరిగితే పవన్ కళ్యాణ్ రూపొందించిన ఈ క్రియాశీలక సభ్యత్వంతో పాటు ఇన్సూరెన్స్ పొందుపరచడం జరిగిందన్నారు. మొదటి సంవత్సరం సభ్యత్వం కేవలం వందల్లో మాత్రమే ఉందని, రెండో సంవత్సరం అది వేలల్లోకి చేరిందని, మూడో సంవత్సరం లక్షల్లోకి వచ్చిందని, ఈ ఏడాది పది లక్షల పైచిలుకు క్రియాశీలక సభ్యత్వ నమోదు సంకల్పంతో ముందుకు వెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం సభ్యత్వాలు తీసుకున్న వారికి జనసేన సభ్యత్వం కార్డు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.






# భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 25న రక్తదాన శిబిరం



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, మే 24)

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వారోత్సవాలలో భాగంగా మే 25న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జవహర్ నర్సింగ్ హెూం నందు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ద్వారా గత రెండు సంవత్సరాలలో 400 మందికి పైగా రక్తదానం చేయడం జరిగిందన్నారు. చీమకుర్తి , పరిసర ప్రాంత ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడైనా రక్తదానం చేయడంలో భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ముందుంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి దేవరాజు తెలిపారు. అదేవిధంగా రేపు జరిగే బ్లడ్ డొనేషన్ క్యాంపులో చీమకుర్తికి చెందిన విద్యార్థులు, యువకులు పాల్గొని ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపును జయప్రదం చేయాలని కోరారు.

# పోష్ చట్టంపై అవగాహన



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 24)

హైకోర్టు ఆదేశాల మేరకు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కనిగిరి కోర్టు హాల్ నందు పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం, 2013 (పోష్ చట్టం) పై కనిగిరి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన కల్పించారు. పోష్ చట్టం గురించి అవగాహన కల్పించడం ద్వారా, పని ప్రదేశంలో మహిళలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చన్నారు. లైంగిక వేధింపులను నివారించవచ్చునని అన్నారు. పోష్ చట్టం పని ప్రదేశంలో లైంగిక వేధింపులను నివారించడానికి, నిషేధించడానికి మరియు ఫిర్యాదులను పరిష్కరించడానికి రూపొందించబడిందని తెలిపారు. ఈ చట్టం అన్ని రకాల పని ప్రదేశాలకు వర్తిస్తుందని ప్రతి సంస్థలోనూ, లైంగిక వేధింపుల ఫిర్యాదులను విచారించడానికి , పరిష్కరించడానికి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. పోష్ చట్టం ప్రకారం ఏదైనా నిబంధనను ఉల్లంఘించినా లేదా ఉల్లంఘించడానికి ప్రయత్నించినా, గరిష్టంగా రూ.50,000 జరిమానా విధించబడుతుందని,పోష్ చట్టాన్ని పాటించకుండా యజమాని దోషిగా తేలితే మొదటిసారి విధించిన శిక్షకు రెండు రెట్లు, వ్యాపార లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని చట్టంలో ని వివిధ సెక్షన్ లపై వివరించారు.ఈ చట్టం గురించి న్యాయవాదులు,పారా లీగల్ వాలంటీర్లు విస్తృతంగా ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు ఈ నెల 24వ తేదీ శనివారం ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలో 28.04.2025 నుండి 06.06.2025 వరకు జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 22వ రోజు కార్యక్రమాలకు 54 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. వేసవి విజ్ఞాన




శిబిరంను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సందర్శించి పిల్లలు నేర్చుకుంటున్న శిక్షణ నకు సంబంధించిన విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు కార్యక్రమంలో మొదటగా గ్రంథాలయ సిబ్బంది పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం టి.శ్రీనివాసరావు యోగా క్లాస్ లో పిల్లలకు ఆసనాలు వేయటం, ధ్యానం చేయటం నేర్పించారు. దాసరి లక్ష్మీ ప్రసాద్ స్పేర్ టైం యాక్టివిటీస్ సింపుల్ మ్యాజిక్ ట్రిక్స్ చేసి చూపించారు. తదుపరి అంకెలతో బొమ్మలు గీయడం నేర్పించారు. వి.వెంకయ్య మాస్టర్ స్పోకెన్ ఇంగ్లీషు గ్రామర్ రూల్స్ గురించి బోధించటం జరిగింది. గ్రంథాలయ సిబ్బంది. పిల్లలకు కథలు చెప్పటం జరిగింది. సృష్టి ఆర్ట్స్ అకాడమీ వారు టి రవీంద్ర, శిరీష డ్రాయింగ్ క్లాస్‌లో అందమైన సీనరీస్‌కు సంబంధించిన చిత్రాలు గీయటం నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

# ఒకటి నుంచి డీలర్ల ద్వారా ప్రజలు బియ్యం తీసుకోవాలి

## తహసీల్దార్ వి పుల్లారావు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 24)

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ వి పుల్లారావు మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొబైల్ రేషన్ వ్యానులు రద్దు చేయబడతాయన్నారు. ప్రజలు రేషన్ షాపులో డీలర్ల ద్వారా బియ్యం తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజలకు రేషన్ షాపులో బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

# మాలకొండను దర్శించుకున్న ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి ఇన్‌ఛార్జి, మే 24)

మాలకొండ మాల్యాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని శనివారం పామూరు రెండో ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యులు, జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు, అధికారులు ఆయనకు శేష వస్త్రాలు అందించి ఘన స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోతరాజు అనిల్, బజరంగ్ దళ్ అధ్యక్షులు జంకల నరేష్, బండి కిరణ్, ఇతర మిత్రులు పాల్గొన్నారు.

# వివాహ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 24)

గుడ్లూరు మండలం కొత్తపేట గ్రామంలో జాజుల కొండయ్య కోటేశ్వరమ్మ కుమారుడు నరేంద్ర, పూజిత వివాహ కార్యక్రమం జరగగా హాజరై నూతన వధూవరులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు. గొర్ల కొండయ్య, రమణమ్మ కుమారుడు కొండయ్య వివాహం కొత్తపేట గ్రామంలో జరగగా హాజరై నూతన వధూవరులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు.

# మార్కాపురం సబ్ జైలు తనిఖీ




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 24)

మార్కాపురం సబ్ జైల్ ను ప్రకాశం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ శనివారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా వంటశాల, స్టోర్ రూమ్, ఖైదీలు ఉండే గదులను పరిశీలించారు. ఖైదీల యొక్క స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం కావలసినవారు మండల లీగల్ సర్వీస్ అథారిటీ ని సంప్రదిస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఖైదీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉషశ్రీ, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ పిఎల్‌వి, షేక్ బాషా, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పసుపు పండుగ మహానాడుకు మైనారిటీ సోదరులు తరలిరావాలి

## టిడిపి ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)

ఈ నెల కడపలో 27, 28, 29వ తేదీల్లో జరిగే మూడు రోజుల పసుపు పండగకు మైనార్టీ సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అన్న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జరుపుకునే పండుగ మహానాడు నాడు అన్న ఎన్టీఆర్ పేదలు, బడుగు ,బలహీన వర్గాల కోసం స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన 9 నెలలోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. అదే వరవడిని కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టించిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది.అభివృద్ధి అంటే గుర్తొచ్చేది బాబేనన్నారు. ఐటి, అనేక పరిశ్రమలు స్థాపించిన విజన్ ఉన్న గొప్ప నాయకుడు, అమరావతి సృష్టికర్త చంద్రబాబు అలానే 2019 వైసీపీ పాలనను అంతం అందించటానికి సాగిస్తే పాదయాత్ర లేదంటే దండయాత్ర అని యువగళం పాదయాత్రతో చరిత్ర సృష్టించి తనను తాను నాయకుడిగా మలచుకోని పార్టీకి కార్యకర్తలకు అండగా ఉంటూ కార్యకర్తలే నా కుటుంబం అంటూ ముందుకు నడుస్తూన్న యువ నాయకుడు లోకేష్ అన్న అని అన్నారు. దేశంలో ఏదైనా సెక్యులర్ పార్టీ ఉందంటే అది తెలుగుదేశంపార్టీ అని పార్టీ స్థాపించిన నాటి నుంచి మైనార్టీలు పార్టీకి అండగా ఉన్నారు. మరీ ముఖ్యంగా 2019-2024 జగన్ అరాచక పాలనలో మైనారిటీలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారు. 2024లో పార్టీ అధికారం రావడానికి మైనార్టీల కృషి ఎంతో ఉందన్నారు. ఇకముందు కూడా పార్టీకి అండగా ఉంటారని, మైనారిటీ సోదరులు కలిసి పెద్ద ఎత్తున మహానాడుకు తరలిరావాలని ఈ పసుపు పండుగగా మహానాడును జయప్రదం చేద్దామని ఈ సందర్భంగా రసూల్ మహమ్మద్ పిలుపునిచ్చారు.

# అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 24)

శ్రీ బగళాముఖీ అమ్మవారి ఆలయం సందోలు శనివారం శ్రీ అమ్మవారి దర్శనానికి రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరి వెంట పిట్టల వారి పాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు , వీఆర్వో అరుణ పాల్గొన్నారనీ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జై.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎపిసిపిడిసిఎల్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 24)

ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంస్థ) తరఫున ఏపీసీపీడీసీఎల్, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి పుల్లారెడ్డి ఒంగోలుకు వచ్చిన సందర్భంగా స్థానిక విద్యుత్ భవన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జిల్లాలకు సంబంధించి న్యూ సర్కిల్ ఫార్మేషన్, స్టాఫ్ బైఫరికేషన్‌లో వచ్చిన ఇబ్బందులు గురించి వారికి తెలిపారు. ఈ విషయంలో వారు స్పందిస్తూ స్టాఫ్‌కు ఇబ్బంది లేకుండా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో స్టేట్ జనరల్ సెక్రెటరీ టంగా సాంబశివరావు, కంపెనీ సెక్రటరీ పి ప్రసాద్, ట్రెజరర్ ఏ దుర్గాప్రసాద్, జి ఆంజనేయులు, ఎస్ కోటేశ్వరరావు, కామేశ్వరరావు, కే ప్రతాప్, రంగమణిర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.





# చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 24)

కందుకూరు పట్టణానికి చెందిన సోమినేని జయంత్ ఆహ్వానం మేరకు పట్టణంలోని జనార్ధనస్వామి కళ్యాణ మండపంలో వారి కుమార్తె సోమినేని నైరా పుట్టిన రోజు వేడుక జరగగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# శునకాలు.. క్యాన్సర్ పసిగట్టేస్తాయ్

- బెంగళూరుకు చెందిన అంకుర సంస్థ కృషి ఫలితం
- ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో వ్యాధి నిర్ధారణ
- కర్ణాటకలో 6 ఆసుపత్రుల్లో అందుబాటులో పరీక్షలు
- బీసీఐ పరికరం తోశిక్షణ పొందుతున్న శునకం

(షణ్ముఖ వెలుగు, బెంగళూరు,మే 24

వాసనతోనే బాంబులు, మాదకద్రవ్యాలను పసిగట్టే సామర్థ్యం శునకాల సొంతం. ఈ సామర్థ్యాన్నే వైద్యరంగం అందిపుచ్చుకుంటోంది. వాటి ఆఘ్రాణశక్తితో 28 రకాల వ్యాధులను గుర్తించగలవని ఇప్పటికే వైద్య అధ్యయనాలు నిరూపించాయి. దీంతో బెంగళూరుకు చెందిన 'డాగ్‌నోసిస్' అనే అంకుర సంస్థ 98% కచ్చితత్వంతో క్యాన్సర్లనూ గుర్తించేలా శునకాలకు శిక్షణ ఇస్తోంది. మనిషి శ్వాసను బట్టి క్యాన్సర్ ఉందా? లేదా? అని తేల్చే మల్టీ క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్ (ఎంసీఈడీ) అనే విధానాన్ని ఆ సంస్థ నిపుణులు కనుగొన్నారు. ఇందులో బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)-డాగ్‌సెన్స్ అనే పరికరం, 'డాగోస్' అనే సాఫ్ట్‌వేర్, న్యూ మెషీన్ లెర్నింగ్ మోడల్స్ ఉన్నాయి.

**ఎలా పసిగడుతుంది...?**

బయో మెడికల్ డిటెక్షన్ సెంటర్‌లో మాస్కును
వాసన చూస్తున్న శునకం
పరీక్ష చేయించుకునే వ్యక్తి ప్రత్యేకంగా తయారుచేసిన మాస్కును
10 నిమిషాల పాటు పెట్టుకోవాలి.
ఆ మాస్క్‌ను ప్రత్యేకమైన కిట్‌లో పెట్టి ల్యాబ్‌కు తరలిస్తారు.
ఇతర వాసనలేవీ మాస్కుకు పట్టకుండా దాన్ని జాగ్రత్తగా బయో మెడికల్ డిటెక్షన్ కౌంటర్ వద్ద ఉంచుతారు.
శిక్షణ పొందిన, బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ)-డాగ్‌సెన్స్ ధరించిన శునకం ఆ మాస్క్‌ను వాసన చూస్తుంది.
అప్పుడు దాని మెదడులో జరిగే స్పందనలను ఈఈజీ అనే పరికరం నమోదు చేస్తుంది.
ఈ డేటాను న్యూ మెషీన్ లెర్నింగ్ మోడల్స్, రియల్ టైమ్ సాంకేతికతతో కూడిన 'డాగోస్' అనే సాఫ్ట్‌వేర్‌తో నిపుణులు విశ్లేషించి.. క్యాన్సర్ ఉందో లేదో ఓ నిర్ధారణకు వస్తారు.
ఇలా 10 రకాల క్యాన్సర్లను గుర్తించే వీలుంది.

**యువకుడి సాధన**

**ఇటామర్ బిటన్‌తో ఆకాశ్(ఎడమ వైపు వ్యక్తి)**

క్యాన్సర్‌ను నాలుగో దశలో గుర్తించడం వల్ల 90% మంది బాధితులకు వైద్యం అందించినా ఫలితం ఉండటం లేదు. ఈ సమస్య భారత్ లాంటి పెద్ద దేశాల్లో ఎక్కువగా ఉంది. అదే.. ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే మరణాలు నివారించవచ్చని కర్ణాటకలోని బెళగావికి చెందిన ఆకాశ్ కుల్‌గోడ్ ఆలోచన. ఈ మథనంలోంచి వచ్చిన ఆలోచనే.. మల్టీ క్యాన్సర్ ఎర్లీ డిటెక్షన్ (ఎంసీఈడీ) విధానం. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కాగ్నిటివ్ న్యూరోసైన్స్ చేసిన



ఆకాశ్.. కెనైన్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్‌లో 3 అధ్యయనాలు, ఒక మేధోహక్కు కూడా పొందారు. శునకాల శిక్షణ నిపుణులైన ఇజ్రాయెల్‌కు చెందిన ఇటామర్ బిటన్‌తో కలిసి ఎంసీఈడీని కనుగొన్నారు. ఈ పరీక్షలకు బీగిల్స్, ల్యాబ్రడార్ శునకాలను ఎంచుకున్నారు. కర్ణాటకలో 6 ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకొని పరిశోధనలు చేస్తున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com